
సాక్షి ఒడిశా

శుక్రవారం । 5 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2.83.224లు, బంగారం 1.2గ్రాములు, వెండి 17.2 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



తీరం.. అల్లకల్లోలం

-IIలో



పెళ్లింట విషాదం

-IIలో

న్యూస్‌రీల్

అర్హులందరికీ పింఛన్ అందించాలి

- అధికారులకు సూచించిన ఎమ్మెల్యే తారాప్రసాద్



లబ్ధిదారుకు పింఛన్ మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యేలు

జయపురం: రాజకీయాలకు తావులేకుండా అర్హులైన దివ్యాంగులు, వితంతువులు, వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి సమితి అధికారులకు సూచించారు. పింఛన్ మరొకరిపై దయతో ఇచ్చేది కాదని, అది వారి హక్కని స్పష్టంచేశారు. దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి, మంజూరు చేయాలని కోరారు. బొరిగుమ్మ సమితి కార్యాలయంలో గురువారం నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కొట్‌పాడ్ ఎమ్మెల్యే పద్మినీ దియాన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరువురూ 288మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. జయపురం అసెంబ్లీ పరిధిలోని 19 పంచాయతీల్లో 140మంది వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు, కొట్‌పాడ్ నియోజకవర్గ పరిధి 12 గ్రామ పంచాయతీల్లోని 148మందికి పింఛన్లు మంజూరయ్యాయి. కార్యక్రమంలో బొరిగుమ్మ బీడీఓ ప్రణయరంజన్ బెహరా, ఏబీడీఓ మురళీ ఆచారి, సంక్షేమశాఖ అధికారులు డాక్టర్ శుభశ్రీ మిశ్రా, బిశ్వజిత్ శత్పతి, రాజకిశోర్ సాహు, దీప్తి రాణి ప్రధాన్, సబ్ డివిజన్ సామాజిక సురక్షా అధికారి, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఝార్సుగుడ ప్రచారంలో నవరంగ్‌పూర్ ఎంపీ



ప్రచారం చేస్తున్న ఎంపీ రమేష్‌చంద్ర మాఝి

కొరాపుట్: ఝార్సుగుడ ఉప ఎన్నిక ప్రచారంలో నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి పాల్గొన్నారు. నియోజకవర్గం లోని కొలాబెరా సమితి సోడామాల్ పంచాయతీలో గురువారం ప్రచారం నిర్వహించారు. బీజూ జనతాదళ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దీపాలి దాస్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. మరోవైపు అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఇప్పటికే ఝార్సుగుడలో మకాం వేశారు. తమ పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారాలు చేపడుతున్నారు.

రూ.20 లక్షల విప్పపువ్వు స్వాధీనం

- నిందితుడి అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించిన పోలీసులు



వాహనంతో సహా పట్టుబడిన నిందితుడితో అధికారులు

రాయగడ: సారా తయారీకి ప్రధాన ముడి సరుకుగా వినియోగించే విప్పపువ్వును అక్రమంగా లారీలో తరలిస్తుండగా ఎక్సైజ్‌శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ ధనేశ్వర్ పాత్రొను అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించారు. దీనికి సంబంధించి ఎక్సైజ్‌శాఖ అదనపు సూపరింటెండెంట్ గుప్తేశ్వర ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం... విప్పపువ్వు అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా కేంద్రానికి సమీపంలోని గుమ్మ ఘాటీ వద్ద ఎక్సైజ్ సిబ్బంది గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి నుంచి వస్తున్న లారీని తనిఖీ చేయగా, 49.20 క్వింటాళ్ల విప్పపువ్వు, 14 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 32 క్వింటాళ్ల ధాన్యం బస్తాలను గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడంతో పాటు నిందితుడిని కోర్టుకు తరలించారు. బహిరంగ మార్కెట్‌లో విప్పపువ్వు విలువ రూ.20 లక్షలు ఉంటుందని, అలాగే లారీని స్వాధీనం చేసుకున్నామని ఐఐసీ తెలిపారు. వీటిని కొరాపుట్ జిల్లాకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు దర్యాప్తులో తేలిందని వివరించారు.

320కిలోల గంజాయి స్వాధీనం..

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 320 కిలోల గంజాయిని సురడా పోలీసు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి తపన్‌కుమార్ నాయక్ అందించిన సమాచారం ప్రకారం కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు సామాచారం అందింది. ఈ మేరకు గంజాం జిల్లా సురడా పోలీసులు.. మార్గం మధ్యలో రెక్కీ నిర్వహించి, వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేశారు. అటుగా వస్తున్న కారులో సోదా చేయగా.. 320 కిలోల గంజాయి బయటపడింది.

మాతృభూమికి.. ముర్ము

- ప్రత్యేక హెలీకాప్టర్‌లో బాదంపహాడ్ చేరుకున్న దేశ ప్రథమ మహిళ ద్రౌపది ముర్ము
- స్వగ్రామం రాయరంగ్‌పూర్‌లో తొలిసారి పర్యటన
- సాదర స్వాగతం పలికిన గవర్నర్, గిరిజనులు
- గ్రామస్తులకు ప్రత్యేకంగా కానుకలు పంపిణీ



భర్త శ్యామ్‌చరణ్ ముర్ము విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం



స్వగ్రామస్తులను పలకరిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



బాదంపహాడ్ హెలీప్యాడ్ వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు స్వాగతం పలుకుతున్న గవర్నర్ గణేషీలాల్



పహాడ్ పూర్‌లో నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: భారత రాష్ట్రపతిగా అత్యున్నత పదవి స్వీకరించిన తర్వాత ద్రౌపది ముర్ము తొలిసారిగా ఆమె జన్మస్థలానికి చేరుకున్నారు. 3రోజుల రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని కట్టుదిట్టమైన భద్రత మధ్య భారత వైమానిక దళం(ఐఏఎఫ్) హెలీకాప్టర్‌లో గిరిజనులు అధికంగా ఉండే బాదంపహాడ్‌కు గురువారం చేరుకున్నారు. రాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తన స్వగ్రామానికి తొలి పర్యటనలో కావడంతో సంప్రదాయ శైలిలో ఘనస్వాగతం లభించింది. గిరిజన బాలికలు, మహిళలు సహా పెద్ద సంఖ్యలో స్థానికులు దేశ ప్రథమ మహిళ ఆ ప్రాంతంలోకి ప్రవేశించగానే డోలు, దరువులతో ఆహ్లాదకరమైన సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. అలాగే హెలీప్యాడ్ వద్ద రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్, కేంద్రమంత్రి బిశ్వేశ్వర్ టుడు, రాష్ట్ర ఉక్కు, గనులశాఖ మంత్రి ప్రఫుల్లకుమార్ మల్లిక్, స్థానిక ఎమ్మెల్యేలు సాదర స్వాగతం పలికారు. రాష్ట్రపతి తన స్వస్థలానికి చేరుకున్న తర్వాత దాదాపు అర కిలోమీటరుకు పైగా రోడ్డుపైనే నడుచుకుంటూ స్వస్థలం వాతావరణం ప్రత్యక్షంగా ఆస్వాదించారు. ముద్దుబిడ్డ ముర్మును పలకరించేందుకు ఇరువైపులా ఆసక్తిగా వేచి ఉన్న గ్రామస్తులు, చిన్నారులు ఉత్సాహంతో మురిసిపోయారు. హెలీప్యాడ్‌కు 5కిలోమీటర్ల దూరంలోని రాయరంగ్‌పూర్ సబ్ డివిజన్‌లోని పహాడ్‌పూర్ గ్రామంలోని మెట్టినింటికి వెళ్తుండగా.. దారి పొడవునా బారులుతీరిన గ్రామస్తులను ఆమె ఆప్యాయంగా చేతులు ఊపుతూ ముచ్చట గొలిపించారు. రాష్ట్రపతికి స్వాగతం పలుకుతూ రాయరంగ్‌పూర్, పహాడ్‌పూర్ ప్రాంతాల్లో హోర్డింగ్‌లు, బ్యానర్లు వెలిశాయి.

అభివృద్ధి పనులకు శ్రీకారం..

పహాడ్‌పూర్‌లో రాష్ట్రపతి ముర్ము భర్త శ్యామ్‌చరణ్ ముర్ము విగ్రహానికి పూలమాల వేసిన ఆమె.. తొలుత శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం స్థానిక ఎస్ఎల్ఎస్ మెమోరియల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. ఈ ప్రాంగణంలో అనేక కార్యక్రమాలను ప్రారంభించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతరులతో ముఖాముఖి సంభాషించారు. ఆమె వెంట గవర్నర్, కేంద్రమంత్రి ఉన్నారు. ముర్ము 3 రోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆమె సొంత జిల్లా మయూర్‌భంజ్‌లో గిరిజన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) చేపడుతున్న ఈ ప్రాజెక్టును గిరిజనులు అధికంగా ఉండే జిల్లాలోని రాయరంగ్‌పూర్ సబ్ డివిజన్ పహాడ్‌పూర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవనోపాధి కార్యక్రమాన్ని ఆవిష్కరించి, నాబార్డ్ ద్వారా నిర్మించనున్న ఎస్ఎల్ఎస్ మెమోరియల్ పాఠశాల ప్రాంగణంలో కమ్యూనిటీ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మహిళలు సహా పలువురు స్థానికులకు మొక్కలు, విత్తనాలు, ఇతర వ్యవసాయ పరికరాలు, పనిముట్లను పంపిణీ చేశారు. మెట్టినిల్లు పహాడ్‌పూర్‌ను సందర్శించిన సందర్భంగా గ్రామంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్థానికులకు వివిధ ట్రేడ్‌లలో నైపుణ్యాన్ని అందించడం ఈ కేంద్రం లక్ష్యంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రయాస్ ట్రస్ట్ అధ్యక్షురాలు మీనా సుబ్రహ్మణ్యం, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. తన గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా గారాలబిడ్డగా ఆత్మీయ అనురాగాలతో సాదర స్వాగతం పలికిన గిరిజన మహిళలకు రాష్ట్రపతి బహుమతులు అందజేశారు.

గ్రామీణుల అభ్యర్థన..

సిమిలిపాల్ మండలం పంచాయతీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని రాష్ట్రపతికి గ్రామస్తులు అభ్యర్థించారు. ఈ మండలం గుడుగుడియా, బొరేహిపాణి, అస్తకుమార్ పంచాయతీల్లో విద్యుత్, రహదారి, మొబైల్ నెట్‌వర్క్ వంటి మౌలిక సౌకర్యాల కొరతతో గ్రామస్తులు కనీస సదుపాయాలను పొందలేక పోతున్నారు. ఈ ప్రాంతంలో బస చేస్తున్న సందర్భంగా స్థానిక సమస్యల పట్ల ప్రత్యేకంగా దృష్టి సారించి సత్వర ఏర్పాట్లకు ఆదేశించాలని కోరారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో ఔటుసోర్సింగ్ వ్యవస్థ రద్దు చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని పలువురు ఒప్పంద ఉద్యోగులు రాష్ట్రపతికి విన్నవించారు.



రాష్ట్రపతికి సంప్రదాయ శైలిలో స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు

వ్యసన రహిత ఒడిశా లక్ష్యం..

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మయూర్‌భంజ్ హత్‌భద్రలో బ్రహ్మ కుమారీస్ కేంద్రం సంకల్పించిన వ్యసనరహిత ఒడిశా ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యసనం ఒక రుగ్మతని పేర్కొన్నారు. 'ఇది సామాజిక, ఆర్థిక, శారీరక, మానసిక శాపం. మాదకద్రవ్య వ్యసనం కుటుంబం, సమాజంలో ఉద్రిక్తతను కలిగిస్తుంది. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటి వినియోగం వల్ల కలిగే చెడు ప్రభావాలను ప్రజలు అర్థం చేసుకున్నప్పుడు, వారు ఖచ్చితంగా దానిని విడిచిపెట్టడానికి ప్రయత్నిస్తార'ని విశ్వాసం వ్యక్తం చేశారు. వ్యసనం సమాజానికి అతి పెద్ద శత్రువు అని అభిప్రాయం వ్యక్తంచేశారు.



అభివాదం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ గణేషీలాల్, ఇతర ప్రముఖులు

దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం గొప్ప కార్యమని తెలిపారు. ఆధ్యాత్మికత ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో బ్రహ్మకుమారీ కేంద్రం నిమగ్నమైందని అభినందించారు. 'వ్యసన రహిత ఒడిశా' ప్రచారాన్ని విజయవంతం చేయాలని ముర్ము ఆకాంక్షించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



రోడ్డుపై బైఠాయించిన మహిళలు

రాయగడ: తాగునీటి సౌకర్యం మెరుగు పరచాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తుల ఆందోళన బాటపట్టారు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి పూజారిగుడ పంచాయతీ రేఖాలుగుడ, శాంతానగర్ గ్రామాలకు చెందిన మహిళలు గురువారం రహదారిపై బైఠాయించి తమ నిరసన తెలియజేశారు. విషయం తెలుసుకున్న బీడీఓ సునీల్ ఖొరా, గ్రామీణ నీటి పారుదలశాఖ అసిస్టెంట్ ఇంజినీర్ బిభూతి పండా ఘటనా స్థలానికి చేరుకుని, గ్రామస్తులతో మాట్లాడారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో అంతా ఆందోళన విరమించారు. రేఖాలుగుడ, శాంతానగర్ గ్రామాల్లో సుమారు 180 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారి తాగునీటి సౌకర్యార్థం 4 గొట్టపు బావులు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం వనరులన్నీ మరమ్మతులకు గురి కావడంతో తీవ్ర నీటిఎద్దడి నెలకొంది. దీనిపై పంచాయతీ అధికారులు దృష్టి సారించక పోవడంతో ఆందోళన చేపట్టామన్నారు.

80 పాఠశాలల్లో స్మార్ట్ తరగతులు

- ప్రారంభించిన ఎంపీ చంద్రశేఖర సాహు



స్మార్ట్‌క్లాస్, ఈ-లైబ్రరీ ప్రారంభిస్తున్న ఎంపీ సాహు

పర్లాకిమిడి: రాష్ట్రంలో అమలవుతున్న 5టీ కార్యచరణలో భాగంగా జిల్లాలోని 80ఉన్నత పాఠశాలలో స్మార్ట్ తరగతులను సీఎం నవీన్ పట్నాయక్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాలోని రాయఘడ బ్లాక్‌లో ప్రభుత్వ ఉన్నత మాధ్యమిక(ఎస్సీ, ఎస్టీ) పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ చంద్రశేఖర సాహు, కలెక్టర్ లింగరాజ్ పండా, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, జిల్లా ముఖ్య విద్యాధికారి ప్రదోష్‌కుమార్ నాయక్, డీఆర్‌డీఏ ఈఓ రమాంచల్ ఖమారి, జిల్లా సంక్షేమశాఖ అధికారి సంతోష్‌కుమార్ రథ్, జిల్లా సమగ్ర గ్రామీణాధికారి ఫాల్గుణి మాఝి, బీడీఓ సుధీర్‌కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఆయా పాఠశాలల్లో స్మార్ట్ తరగతులు, ఈ-లైబ్రరీలు, ఇంటర్‌నెట్‌తో నడిచే స్మార్ట్ బోర్డులు, ఆకర్షణీయమైన బెంచీలు, మినరల్ వాటర్, స్మార్ట్‌క్లాసులు అందుబాటులో ఉంటాయి. ఈ సందర్భంగా సీఎం నవీన్‌కు ఎంపీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మోహానా ఎమ్మెల్యే దాశరథి గమాంగో, కలెక్టర్ లింగరాజ పండా మాట్లాడారు.

వినకుంటే.. విపత్తే!

- పూరీ శ్రీమందిరం ముంగిట తారురోడ్డు పనులు
- ఎగుడు దిగుడుగా నిర్మాణం చేపట్టిన గుత్తేదారు
- యాత్ర, మూలవిరాట్‌ల తరలింపులో విగ్రహాలకు ముప్పు
- తక్షణమే సరిచేయాలని పాలకమండలి, భోయి వర్గాల డిమాండ్





శ్రీమందిరం సింహద్వారం ఆవరణలో కొనసాగుతున్న తారురోడ్డు పనులు

భువనేశ్వర్: మూల విరాటుల అంగాలకు ముప్పు వాటిల్లే విపత్కర చర్యల పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. శ్రీమందిరం సింహద్వారం ఆవరణలో ఇటీవల తారు రోడ్డు పనులు చేపట్టారు. ప్రస్తుత నిర్మాణ శైలి రథయాత్ర ప్రక్రియలో రత్న వేదిక నుంచి యాత్రకు తరలివచ్చే మూలవిరాట్‌ల శ్రీఅంగాల(విగ్రహాల)కు భారీ ముప్పు కలిగించే రీతిలో తారస పడుతున్నాయి. సువిశాల బొడొదండొ మార్గం పొడవునా తారుపూత పూస్తున్నారు. ఈ సందర్భంగా స్వల్ప విభజనతో రెండు అంచెల రోడ్డుగా మలుస్తున్నట్లు వర్ధమాన నిర్మాణశైలి ప్రతిబింబిస్తుంది. ఈ విభజన రథాల కదలికకు తీవ్ర అంతరాయం కలిగిస్తుంది. అలాగే శ్రీమందిరం గర్భగుడి రత్నవేదిక నుంచి మూలవిరాట్ లను రథాల పైకి తరలించే పొహొండి కార్యక్రమంలో కాలు జారడం వంటి చిరు ప్రమాదాలతో పెద్ద తప్పిదాలను ప్రేరేపిస్తాయని కలవర పడుతున్నారు. యాత్ర పొడవునా పలుమార్లు 3 భారీ రథాలను మలుపు తిప్పాల్సిన పరిస్థితులు తలెత్తుతుంటాయి. ఇటువంటి సందర్భాల్లో నిర్మాణశైలి తీవ్ర అంతరాయం కలిగిస్తుంది. యాత్ర నిర్వహణ దృష్టిలో పెట్టుకుని సింహద్వారం ఆవరణ, బొడొదండొ మార్గం తారుపూత పనులు పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విభజన, ఎగుడు దిగుడులు తొలగించాలని శ్రీమందిరం పాలకమండలి సీనియర్ సభ్యుడు దుర్గాప్రసాద్ దాస్ మహాపాత్ర కోరారు. దీనిపై ప్రధాన పాలనాధికారి(సీఏఓ) దృష్టి సారించాలన్నారు.

రథ వాకిలిలో భద్రత..

రథయాత్ర ఆద్యంతాల్లో మూల విరాట్‌ల రథాలు శ్రీమందిరం సింహద్వారం ముంగిట నిలుపుతారు. యాత్ర ప్రారంభం పురస్కరించుకుని ఈ వాకిలిలో రథ ప్రతిష్ఠ ముగించి మూల విరాట్‌లను గొట్టి పొహొండి ప్రక్రియలో ఒక్కొక్కటిగా రథాల పైకి తరలిస్తారు. అలాగే యాత్ర చిట్టచివరి ఘట్టం నీలాద్రి విజే పురస్కరించుకుని రథాలపై ఆసీనులైన మూర్తులను సురక్షితంగా శ్రీమందిరం రత్న వేదికకు తరలించాల్సి ఉంటుంది. ఈ ప్రాంగణంలో సిద్ధం చేసిన తారురోడ్డు ఉపరితలమంతా ఎగుడు దిగుడుగా తయారైంది. ఈ పరిస్థితిని సవరించి పూర్తిగా చదును చేయకుంటే గొట్టి పొహండి, నీలాద్రి విజే పురస్కరించుకుని జరిగే మూల విరాట్‌ల తరలింపు సందర్భంగా కాలు జారుడు వంటి ప్రమాదాలతో మూల విరాట్‌ల భద్రతకు భంగం వాటిల్లే ప్రమాదం తలెత్తుతుంది. యాత్ర ఆద్యంతాలు మలుపు తిప్పే పరిస్థితుల్లో చకచకా తరలే రథాల కదలికకు ఆటంకం కలగవచ్చు. ఈ అభ్యంతరాల దృష్ట్యా రోడ్డు చదును చేసేందుకు సంబంధిత అధికారులు సుముఖంగా స్పందించారు. దశమహాపాత్ర నిర్మాణ సంస్థ అధికారులు ఈ నెలలోగా ఎగుడు దిగుడులు తొలగించి కొత్తగా నిర్మితం అవుతున్న రహదారి చదును చేసే పనులు పూర్తి చేస్తామని అనుబంధ అధికార వర్గాలు హామీ ఇచ్చారు.

సర్దుబాటుకు ఆదేశాలు..

తారుపూతలో ఎగుడు దిగుడుల కారణంగా యాత్ర ఆద్యంతాల్లో రథాన్ని మలుపు తిప్పడంలో పలు ఇబ్బందులు తలెత్తుతాయని అనుబంధ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ అభ్యంతరాలను ఆలయ డిప్యూటీ అడ్మినిస్ట్రేటర్ పూరీ జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో నిర్మాణ శైలిలో స్వల్ప మార్పుతో అనుకూల రీతిలో సర్దుబాటు చేయాలని నిర్మాణ సంస్థ ఓబీసీసీని ఆదేశించారు.

రథశాల ప్రాంగణంలో..

శ్రీమందిరం కార్యాలయం పరిసరాల్లో స్వామి వార్షిక రథయాత్ర కోసం కొత్త రథాల తయారీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రథాల పలు భాగాల నిర్మాణం అంచెలంచెలుగా పూర్తి కావడంతో క్రమ పద్ధతిలో అమర్చి, రథం రూపుదిద్దుతారు. అనంతరం ఈ ప్రాంగణం నుంచి మలుపు తిప్పి శ్రీమందిరం సింహద్వారం ఆవరణకు తరలించాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రాంగణంలో తారురోడ్డుపై రాళ్లు తేలుతున్నాయి. రథ భాగాల అమరిక పురస్కరించుకుని భారీ కొయ్య భాగాల తరలింపు, రథాల మలుపు పురస్కరించుకుని రోడ్డుపై తేలియాడుతున్న రాళ్లతో ఊహాతీత ప్రమాదాలు తలెత్తే అవకాశం లేకపోలేదని భోయి సేవకవర్గం ప్రముఖుడు సర్దార్ రవిభోయి తెలిపారు. ఈ ప్రాంగణంలో తారురోడ్డుపై రాళ్లు తొలగించి చదును చేయడం అనివార్యంగా పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు తెలియజేసినట్లు వివరించారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష

తెర్లాం: నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఓ వ్యక్తి మృతి చెందడానికి, ఇద్దరు వ్యక్తులు గాయపడడానికి కారణమైన ముద్దాయి ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్షతోపాటు, రూ.2,500లు అపరాధ రుసుమును బొబ్బిలి పీజేసీజే కమ్ జేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ సరోజినమ్మ విధించారు. దీనికి సంబంధించి తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జన్నివలస గ్రామానికి చెందిన నాగళ్ల అప్పలనాయుడు 2020 డిసెంబర్ 7న ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని రాజాం వెళ్తున్నాడు. పెరుమాళి దాటిన తరువాత శ్రీసత్యసాయి స్కూల్ ఎదురుగా రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నెమలాం గ్రామానికి చెందిన కోనారి నరసింహులు మృతి చెందగా, మరో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యా యి. అప్పట్లో ఆటో డ్రైవర్‌పై పోలీసులు కేసు నమో దు చేసి అరెస్ట్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఈ కేసును బొబ్బిలి కోర్టుకు అప్పగించారు. ఈ కేసుకు సంబంధించి తీర్పు వెలువడింది.

మళ్లీ పులి ఆందోళన

శృంగవరపుకోట: మండలంలో మళ్లీ పులి పాదముద్రలు కనిపిస్తున్నాయంటూ రైతులు భయాందోళన చెందుతున్నారు. పెదఖండేపల్లి గ్రామంలో డాక్టర్ సతీష్‌రాజు పొలం వద్ద గొంప అప్పారావు కళ్లం వద్ద పులి పాదముద్రలు గుర్తించామని ఒక్కో పాదముద్ర 8అంగుళాల పరిమాణంలో ఉందని స్థానికులు చెప్పారు. పాదముద్రలను బట్టి పులిగా అనుమానిస్తున్నామని, గతంలో ఇదే ప్రాంతంలో పులి దాడి చేసి ఒక ఆవు పెయ్యిని సమీపంలోని మెట్టపైకి ఈడ్చుకుపోయిందని గుర్తు చేశారు. కొందరు మాత్రం కొత్తూరు – మల్లిపూడి రహదారిలో పులి పాదముద్రలు చూశామని చెబుతున్నారు. దీంతో పులి ఎస్.కోటకు ఉత్తరవైపున ఉన్న పెదఖండేపల్లి వైపు తిరుగుతోందా? దక్షిణ దిక్కున ఉన్న మల్లిపూడి వైపు మసలుతోందో తెలియక ఆందోళన చెందుతున్నారు. రెండు ప్రాంతాల్లో రెండు పులులు ఉన్నాయా? అన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు. పులి జాడలు కనిపిస్తున్నందున పశువుల కాపరులు, మేకలు, గొర్రెల మందల వెంట వెళ్లే కాపరులు ఒక్కొక్కరుగా పోవద్దని అటవీశాఖ అధికారులు కోరుతున్నారు.

రిమాండ్‌కు గంజాయి నిందితుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఎల్.అప్పలనాయుడు

గజపతినగరం: మండలంలోని మరుపల్లి గ్రామ హైస్కూల్ సమీపంలో గంజాయితో పట్టుబడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన సర్కిల్ ఆఫీస్ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మరుపల్లి గ్రామానికి చెందిన పీతల శివ చెడువ్యసనాలకు బానిసయ్యాడు. చిన్ననంలోనే తల్లి చనిపోవడంతో తండ్రి రెండో వివాహం చేసుకున్నాడు, అప్పటినుంచి సంరక్షణ సక్రమంగా లేకపోవడంతో చెడువ్యసనాలకు లోనై ఏడాదిన్నర క్రితం రాజమండ్రిలో ప్రమాదానికి గురికావడంతో బాధలు తగ్గించుకునేందుకు గంజాయి బారిన పడ్డాడు. ఈ క్రమంలో నిత్యం రాయగడ వెళ్లి తాటిమంజులు విక్రయించడం, అక్కడి నుంచి గంజాయిని కొనుగోలు చేసి తెచ్చి మరుపల్లి, మానాపురం తదితర ప్రాంతాల్లో సరఫరా చేసేవాడు. సమాచారం మేరకు స్థానిక ఎస్సై గంగరాజు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిందితుడిని గంజాయితో స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్సై గంగరాజు పాల్గొన్నారు.

8న అప్రంటీస్ మేళా

విజయనగరం రూరల్: రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 8న ప్రధానమంత్రి జాతీయ అప్రంటీస్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్న అప్రంటీస్ మేళాకు ఐటీఐలలో వివిధ ట్రేడ్లలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. అభ్యర్థులు అప్రంటీస్ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రంతో పాటు ఆధార్ కార్డు, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణత మార్కుల జాబితాను తీసుకురావాలని సూచించారు. నిరుద్యోగ ఐటీ ఐ అభ్యర్థులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

వెబ్‌సైట్‌లో సమస్త సమాచారం

విజయనగరం ఫోర్ట్: వైద్య కళాశాలకు సంబంధించి సమస్త సమాచారం వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రభుత్వ వైద్య కళాశాల వెబ్‌సైట్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెబ్‌సైట్‌లో కళాశాలలో సిబ్బంది, ప్రత్యేకతలు, సీట్లు తదితర అన్ని వివరాలు ఉంటాయని తెలిపారు. కళాశాల ప్రత్యేకత కూడా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు పాల్గొన్నారు.

తీరం.. అల్లకల్లోలం

- తుఫాన్‌గా మారిన అల్పపీడనం
- దక్షిణ ఒడిశాకు భారీ వర్షం సూచన
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం



గోపాల్‌పూర్‌లో ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న సముద్ర కెరటాలు

బరంపురం: ఉత్తర బంగాళాఖాతం అండమాన్ దీవిలో ఏర్పడిన అల్పపీడనం పెను తుఫానుగా మారనుంది. దీని ప్రభావంతో ఈనెల 6 నుంచి 9వరకు దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవనున్నట్లు భారత వాతావరణ అధ్యయన కేంద్రం అధికారులు తెలిపారు. తాజా సమాచారం అందే సమయానికి గోపాల్‌పూర్ తీరానికి 700కిలోమీటర్ల దూరంలో తుఫాను కేంద్రీకృతమై ఉంది. మూడు రోజుల క్రితం బంగాళాఖతంలో ఏర్పడిన అల్పపీడనం సైక్లోన్‌గా మారినట్లు వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీని ప్రభావంతో తుఫాను తీరందాటే సమయంలో భారీ వర్షంతో పాటు గంటకు సుమారు 80నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. అలాగే గంజాం, గజపతి, రాయగడ, ఖుర్దా, జగత్సింగపూర్, పారాదీప్ జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర లోని శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం తీరప్రాంతాల్లో భారీ నష్టం జరిగే ప్రమాదం ఉన్నట్లు సమాచారం. మరోవైపు గంజాం జిల్లా ఛత్రపూర్‌లో కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా వివిధ విభాగాలకు చెందిన ప్రభుత్వ అధికార్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. సాధ్యమైనంత వరకు తుఫాన్ ప్రభావంతో ప్రాణ, ఆస్తినష్టం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

గోపాల్‌పూర్‌లో..

ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గోపాల్‌పూర్ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. పారాదీప్ నుంచి కళింగపట్నం మధ్య తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర హెచ్చరించగా.. సైక్లోన్ జోన్‌గా గుర్తింపు పొందిన గోపాలపూర్ సైతం ఇదే ఆందోళన కొనసాగుతోంది. దీని కారణంగా తీరంలో 5 మీటర్లకు పైగా సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఇప్పటికే మోటార్ బోట్లతో చేపల వేటపై నిషేధం ఉండగా.. సంప్రదాయ బోట్లు సైతం తీరానికే పరిమితమయ్యాయి. జిల్లాలోని సముద్ర తీరానికి సమీపంలో ఉన్న గ్రామాల ప్రజలు, మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లే పనిలో ఉన్నారు.

తుఫాను బాధితులను ఆదుకోవాలి

జయపురం: ఇటీవల విరుచుకుపడిన పెనుగాలులతో కూడిన అకాల వర్షాలు, తుఫాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులు, ఇల్లు కోల్పోయిన కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని జయపురం సమితి బాధితులు కోరారు. ఈ మేరకు సామాజిక కార్యకర్త బి.హరిరావు నేతృత్వంలో పలువురు బాధితులు జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రదాన్‌ను ఆయన కార్యాలయంలో గురువారం కలిసి, వినతి పత్రం అందించారు. అధికారులు కేవలం టార్పాన్లు ఇచ్చి, చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఎవరికి భూమి పట్టాలు ఉన్నాయో వారికి మాత్రం కొంత ఆర్థికసాయం అందించారని, మిగతా బాధితులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై దృష్టి సారించి, బాధితులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమేష్ జాని, సాను ఖొర, బలరాం జాని తదితరులు పాల్గొన్నారు.



తీరంలో వలలు సర్దుకుంటున్న మత్స్యకారులు



సబ్ కలెక్టర్‌కు అందిస్తున్న హరిరావు, బాధితులు

పెళ్లింట విషాదం

- ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ముగ్గురి మృతి.. 10 మందికి గాయాలు



తలకు బలమైన గాయంతోయువకుడు



చిత్రకొండ ఆరోగ్య కేంద్రం వద్ద బాధిత కుటుంబ సభ్యులు



ఆరోగ్య కేంద్రం వద్ద బాధితులను పరిమర్శిస్తున్న చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి బోడపుట్ ఘాటీలో ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ముగ్గురు మృతిచెందగా, 10 మందికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బోడపాదర్ పంచాయతీకి చెందిన 15మంది గాజుల మమ్ముడి పంచాయతీ తంట్లగూడ గ్రామంలో జరుగుతున్న వివాహానికి బుధవారం ఉదయం ట్రాక్టర్‌పై వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తున్న సమయంలో ఖరిమాల్ సమీపం బోడపుట్ ఘాటీలో వాహనం అదుపు తప్పి, 30అడుగుల లోయలోకి బోల్తా పడింది. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు సమాచారం అందించగా, వెంటనే అక్కడికి చేరుకొని, లోయలో పడి ఉన్న వారిని బయటకు తీశారు. పలువురు తీవ్రంగా గాయపడగా చిత్రకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే సమయానికి ఓ వ్యక్తి మృతిచెందారు. గురువారం ఉదయం 9గంటల సమయంలో చికిత్స పొందుతూ మరో వ్యక్తి సహా ఐదేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. మరో 10 మందిచి గాయాలుకాగా, ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క ఆరోగ్య కేంద్రానికి చేరుకొని, క్షతగాత్రులు, బాధిత కుటుంబాలను కలుసుకున్నారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు పరిహారం అందిచేందుకు తనవంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. మరోవైపు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. ఘటనపై చిత్రకొండ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

లారీ యజమానుల సంఘానికి ఎన్నికలు

- అధ్యక్ష పదవికి కొండబాబు నామినేషన్



అధ్యక్ష పదవికి నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న కొండబాబు

రాయగడ: లారీ యజమానుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలకు నగారా మోగింది. ఈనెల 7న ఎన్నికలు నిర్వహించనుండగా నామినేషన్ల దాఖలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా న్యాయవాదులు బ్రజసుందర్ నాయక్, బిరజా పాత్రో వ్యవహరిస్తున్నారు. కొరాపుట్ కూడలికి సమీపంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా లారీ యజమానుల సంఘం అధ్యక్ష పదవికి వై.వెంకటేశ్వరరావు(కొండబాబు) తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారులకు సమర్పించారు. అదేవిధంగా ఉపాధ్యక్ష పదవికి కె.సూరిబాబు, బొచ్చా రమేష్, సాధారణ కార్యదర్శి పదవికి కడుపుకూట్ల జానకీరామయ్య, సహాయ కార్యదర్శి పదవికి ఎం.భానుప్రసాద్, ముదులి, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి జి.రామ్‌మోహన్, కోశాధికారి పదవికి వీజీ ప్రసాద్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. అధ్యక్ష, సాధారణం కార్యదర్శుల పదవులకు ఒక్కొక్కరు మాత్రమే నామినేషన్ పత్రాలు దాఖలు చేయడంతో ఆయా పదవులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సమాచారం. అయితే అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో జిల్లాకు పతకాలు



రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన చెస్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. విజయనగరం వేదికగా ఈనెల 1, 2 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో ఫైర్ చెస్ స్కూల్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ కేటగిరిల్లో 14 మంది క్రీడాకారులకు బహుమతులు వచ్చాయి. ఓపెన్ కేటగిరిలో కె.ప్రహ్లద్, కె. సోమనాథ్ (కేంద్రియ విద్యాలయం) సత్యసాగర్ నాయుడు, ఎం.జయ శ్రీ (పీఎస్ఆర్ స్కూల్), కె.దివీస్, జి.కాశిష్ (సన్ స్కూల్), ఎస్.జోషిత్, కె.కీర్తి (నారాయణ స్కూల్) షేక్ షకీల్ (నవోదయ) బి.అభయ్ సాయి (ఢిల్లీ పబ్లిక్ స్కూల్) ఎన్.ప్రియాంక, ఎం సుహాష్ (శ్రీ చైతన్య స్కూల్) రిజ్వాన్ (ఫోర్ట్ సిటీ) కె.రిషి (మై లైఫ్ స్కూల్)లు బహుమతులు పొందారు. క్రీడాకారులకు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి, కోచ్ అభినందనలు తెలియజేశారు.

రైలు నుంచి జారిపడి హోంగార్డు మృతి



విజయనగరం క్రైమ్: హోంగార్డు గోవిందరావు మృతదేహం

విజయనగరం క్రైమ్: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా అన్నంపేట కాపువీధికి చెందిన మజ్జి గోవిందరావు (43) రైలునుంచి జారిపడి గురువారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యేందుకు హోం గార్డు గోవిందరావు హైదరాబాద్‌నుంచి శ్రీకాకుళానికి రైలులో బయల్దేరాడు. విజయనగరంలోని మహిళా ప్రాంగణం వద్దకు వచ్చే సరికి మలుపు వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య పావని, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై రవివర్మ తెలిపారు.

బైక్ బోల్తా పడి యువకుడు..

జామి: బైక్ అదుపు తప్పడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. జామి గ్రామాని కి చెందిన బోని సందీప్ (25) జామి నుంచి విజయ నగరం బైక్‌పై బుధవారం రాత్రి వెళ్తున్న సమయంలో భీమసింగి జంక్షన్ వద్ద వృద్ధుడు ఎర్రి ఈశ్వరరావు పాన్‌షాప్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో వృద్ధుడిని తప్పించబోయి బైక్ బోల్తా పడి సందీప్ మృతి చెందాడు. వృద్ధుడు ఈశ్వరరావుకు గాయాలయ్యాయి. మృతుడి భార్య దేవమ్మ విజయనగరంలో ఒక జ్యూయలర్ షాపులో పనిచేస్తోంది. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

గజపతినగరం: మూడు రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసిన మండలంలోని మరుపల్లి గ్రామానికి చెందిన పైల భాస్కరరావు(28) ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయంపై ఎస్సై గంగరాజును సంప్రదించగా తమకు ఎటువంటి సమాచారం రాలేదని చెప్పారు.

కారు ఢీకొని మరొకరు..



బొబ్బిలి: ప్రమాద స్థలి వద్ద అపస్మారక స్థితిలో లక్ష్మణ రావు

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐ కాలనీ వద్ద కారు ఢీకొని మండలంలోని చింతాడకు చెందిన బిక్కోలు లక్ష్మణ రావు(55) గురువారం రాత్రి మృతి చెందాడు. రామభద్రపురం నుంచి ద్విచక్ర వాహనంపై బొబ్బిలి వస్తున్న లక్ష్మణరావును మద్యం మత్తులో కారు నడుపుతున్న పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం లచ్చయ్యపేటకు చెందిన బత్తుల సాయిరాం బలంగా ఢీకొట్టడంతో లక్ష్మణరావు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ట్రాఫిక్ పోలీసులు ప్రమాదాన్ని గుర్తించి క్షతగాత్రుడిని ఆటోలో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. లక్ష్మణరావు ఇటుకల తయారీ కేంద్రంలో భార్య లక్ష్మితో కలిసి పనిచేస్తున్నాడని ఇద్దరు పిల్లలున్నట్లు మృతుని బంధువులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శివాలయంలోకి ఏనుగులు



పక్కుడుభద్ర ఆలయంలోకి ప్రవేశిస్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని పక్కుడుభద్ర సమీపంలో జీర్ణోద్ధరణ జరుగుతున్న స్వయం భూ దేవాలయంలోకి గురువారం ఆరు ఏనుగుల గుంపు ప్రవేశించి ప్రత్యేకత చాటుకుంది. ఏనుగులు ప్రతి రోజూ ఆలయంలోకి ప్రవేశిస్తున్నాయని స్థానికులు చెబుతుంటారు. అయితే వాస్తవంగా స్వయం భూ దేవాలయంలోకి ఏనుగులు ప్రవేశించి గంట కొట్టాయని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. బత్తిలికి చెందిన శాసనపురి కుటుంబసభ్యులతో జీర్ణోద్ధరణ జరుగుతున్న ఆలయంలోకి ఏనుగులు ప్రవేశించడంపై విశేష ప్రచారం కొనసాగుతోంది. ఇంతవరకు పంట నష్టాలపై చెప్పుకునే రైతులు, ఇప్పుడు ఏనుగుల ఆలయ ప్రవేశంపై ప్రచారం చేస్తున్నారు.

అర్ధరాత్రి ఆకతాయిల వీరంగం



వాహనాన్ని, అడ్డుకుంటున్న ఆకతాయిలు

రాజాం సిటీ: స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద బుధవారం అర్ధరాత్రి సమయంలో మద్యం సేవించిన ఆకతాయిలు వీరంగం వేశారు. సుమారు పది మంది వరకు గుంపుగా చేరి రోడ్డుపై వస్తున్న వాహనాలను అడ్డగించారు. దీంతో వాహనదారులతో పాటు ఇతరులు ఇబ్బందులకు గురయ్యారు. నడిరోడ్డుపై ఆకతాయిలు వికృతచేష్టలకు పాల్పడుతుండడంతో పట్టణవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై టౌన్ సీఐ రవికుమార్ వద్ద ప్రస్తావించగా ఆకతాయిలను సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించామని, వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నామన్నారు.

ఆగమోక్తంగా శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ



కలశాలతో శ్రీవారి ఆలయంలోకి వెళ్తున్న టీటీడీ చైర్మన్ వైవీసుబ్బారెడ్డి దంపతులు

- ఘనంగా యాగశాలలో మహా పూర్ణాహుతి
- పూజల్లో పాల్గొన్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు
- వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



ఆలయాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సీతంపేట: సీతంపేటలో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ మహా సంప్రోక్షణ గురువారం ఘనంగా జరిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. యాగశాలలో మహా పూర్ణాహుతి జరిపారు. అనంతరం కుంభ ప్రదక్షిణ చేశారు. వృషభ లగ్నంలో మహా సంప్రోక్షణ కళావాహన చేపట్టారు. ఈ క్రతువుల ద్వారా యాగశాలలోని కలశాలలో ఇమిడి ఉన్న దేవతా శక్తిని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీపద్మావతి అమ్మవారు, శ్రీగోదాదేవి, గరుడాళ్వార్, ద్వారపాలకుల విగ్రహాల్లోకి ఆవాహన చేశారు. అనంతరం అక్షతారోపణ, బ్రహ్మఘోష, ఆచార్య బహుమానం అందించారు. ఉదయం 10 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం ప్రారంభమైంది. సీతంపేట పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అన్నప్రసాదాలు భక్తులకు అందజేశారు. సాయంత్రం శ్రీవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆరు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాల్లో శ్రీవారి సేవకులు విశేష సేవలు అందించారు. భక్తులకు తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ, ఆలయానికి అవసరమైన పూలు కట్టడం తదితర సేవలు అందించారు. టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాటం, భరతనాట్య ప్రదర్శన, ఇతర భజనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, పాముల పుష్పశ్రీవాణి, రెడ్డి శాంతి, కంబాల జోగులు, శంబంగి చిన్నఅప్పలనాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లాది కృష్ణారావు, జీసీసీ ఎండీ సురేష్‌కుమార్, ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈ సత్యనారాయణ, వీజీఓ మనోహర్, ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జనంలోకి చుక్కల జింక



ఫారెస్ట్ ఎఫ్‌బీఓ లక్ష్మినారాయణకు చుక్కల జింకను అందిస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధి పెద్దదేవాంగులవీధిలోని కొత్తగా నిర్మిస్తున్న ఓ ఇంటిలోకి గురువారం ఉదయం చుక్కల జింక జొరబడింది. స్థానిక యువకులు పట్టుకుని ఫారెస్టు అధికారులకు అప్పగించారు. స్థానిక యువకులు, వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, నీలమణి దుర్గ ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావులు జింకను ఫారెస్టు బీట్ అధికారి కె.లక్ష్మినారాయణ, సిబ్బందికి అప్పగించారు. జింకకు వైద్యం అందించి, అటవీ శాఖ రేంజర్ రాజశేఖర్ ఆదేశాలమేరకు అడవిలోకి విడిచిపెట్టామని ఎఫ్‌బీఓ తెలిపారు.

విద్యుత్ సిబ్బంది వైఖరిపై మండిపాటు




ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పొందూరు: తొమ్మిదేళ్ల తర్వాత గ్రామంలో నిర్వహించుకున్న గ్రామదేవత పండగల సమయంలో నాలుగు రోజులు కరెంటు లేకపోవడంతో నరసాపురం వాసులు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం చుట్టుముట్టారు. గ్రామంలో ఆదివారం నుంచి గ్రామదేవత పండగ ప్రారంభమైంది. ఊరంతా విద్యుత్ దీపాలతో అలంకరించడంతో లోడ్ పెరిగి సోమవారం నుంచి విద్యుత్ నిలిచిపోయింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఏఈని ప్రతి రోజు కోరామని, అయినా స్పందించలేదని గ్రామస్తులు ఆరోపించారు. మోటార్లు పనిచేయకపోవడంతో తాగునీరుకి, ఇతర అవసరాలకు తీవ్ర ఇబ్బందులు పడ్డామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన మహిళలు, గ్రామస్తులు ఏఈ దుర్గాప్రసాద్‌ను నిలదీశారు. పాత డీపీలు, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని ఏడాది కిందటే లైన్‌మెన్ లక్ష్మణరావుకు రూ.8.25 లక్షలు ఇచ్చామని గ్రామస్తులు తెలిపారు. అయినా ఏర్పాటు చేయలేదని, లైన్‌మెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యాలయం ముందు బైఠాయించారు. అక్కడకు చేరుకున్న ఏడీఈ రమణమూర్తి గ్రామస్తులతో మాట్లాడి విద్యుత్ సరఫరా పునరుద్ధరించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు శాంతించారు.

6, 7 తేదీల్లో కాష్యూ ఎక్స్‌పో

కాశీబుగ్గ: ది పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో ఏడో కాష్యూ టెక్నో ఎక్స్‌పో–2023 నిర్వహిస్తున్నట్లు పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా సురేష్ తెలిపారు. పీసీఎంఏ కార్యాలయం పరిధిలో ఆయన గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి మంత్రి సీదిరి అప్పలరాజు ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. హర్షిత ఇండస్ట్రియల్ ట్రేడ్ ఎగ్జిబిషన్స్ వారి స్టాల్స్ జీడి పప్పు ఉత్పత్తులు, వాటి నుంచి తయారయ్యే పదార్థాలు వాటి ఉపయోగాలపై ఎక్స్‌పో వివరిస్తుందని అన్నారు. రెండు రోజుల కార్యక్రమంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, రైతులు అందరూ హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సుందరాకారునికి చందనాలంకరణ



చందన అలంకరణలో వెంకన్న

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం లోని డీసీసీబీ కాలనీలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో నృసింహ జయంతి సందర్భంగా గురువారం స్వామిని చందనంతో అలంకరించారు. 11 కిలోల చందనాన్ని విగ్రహానికి పూశారు.

కలెక్టర్‌కు రెడ్‌క్రాస్ బంగారు పతకం

శ్రీకాకుళం కల్చరల్: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బంగారు పత కం అందుకోనున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ద్వారా రక్త సేకరణ, మొక్కలు నాటే కార్యక్రమం, టీబీ, హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ అందించడం తదితర సేవా కార్యక్రమాలకు సంబంధించి ఈ బంగారు పతకం అందుకోనున్నట్లు తెలిపారు.

‘ప్రత్యేక’ శ్రద్ధ



టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న లెక్చరర్.

- ఇంటర్ తప్పిన విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే విధంగా ప్రత్యేక తరగతులు
- ఇంటర్ చదివిన కళాశాలతో పాటు ఎక్కడైనా తరగతులకు హాజరయ్యే విధంగా వెసులుబాటు
- గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం సరికొత్త నిర్ణయం

టెక్కలి: ప్రభుత్వ విద్యలో నూతన విధానాలకు నాంది పలుకుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో వినూత్న పద్ధతికి తెర తీసింది. ఇది వరకు పరీక్షల్లో ఫెయిలైతే విద్యార్థులు ప్రైవేటు క్లాసులకు వెళ్లేవారు. లేదంటే ఇంటి వద్దనే సొంతంగా చదువుకునేవారు. కానీ ఇంటర్ ఫెయిలైన వారి కోసం ప్రభుత్వం మళ్లీ కాలేజీల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఏ ఒక్క విద్యార్థీ వెనుకబడిపోకూడదనే ఉద్దేశంతో అధ్యాపకులను రప్పించి ఫెయిలైన వారికి మళ్లీ క్లాసులు నిర్వహించనుంది.

ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులతో పాటు సుదూర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల కోసం ప్రభుత్వం ఓ వెసులుబాటు కల్పించింది. ప్రస్తుతం చదువుతున్న కళాశాలల్లో కాకుండా విద్యార్థులకు చేరువగా ఉన్న కళాశాలలకు వెళ్లి ఈ తరగతులను వినే విధంగా చర్యలు చేపట్టారు. ఏ ఒక్క విద్యార్థి నష్టపోకూడదనే ఆలోచనతో గతంలో ఎన్నడూ లేని విధంగా తీసుకున్న నిర్ణయంతో సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవకాశాన్ని వినియోగించుకోండి

గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటర్ తప్పిన విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఇలాంటి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు ఆయా లెక్చరర్స్ అందుబాటులో ఉంటున్నారు.

– ఎస్.తవిటినాయుడు, ఆర్ఐఓ.

స్పష్టమైన ఆదేశాలు

ఇంటర్ తప్పిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంలో లెక్చరర్స్ వారి కళాశాలల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండాలి. ఇటీవల కలెక్టర్ నిర్వహించిన సమీక్షలో సైతం గట్టి ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి.

– కె.ప్రకాశరావు, డీవీఈఓ.

క్లాసులు ప్రారంభం

ఇంటర్ తప్పిన విద్యార్థుల కోసం జిల్లా వ్యాప్తంగా 88 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఇంటర్ తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించేందుకు ఆయా అధ్యాపకులు కళాశాలల్లో అందుబాటులో ఉంటున్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఇలాంటి ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉపన్యాసకులు కోరుతున్నారు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొత్తం 7,304 మంది విద్యార్థులు హాజరు కాగా 2,921 మంది ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన 4,383 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 8,175 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 4,292 మంది ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన 3,883 మంది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

కెరీర్ ప్రొగ్రామ్ శిక్షణకు 11న అభ్యర్థుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో నిర్వహించే కెరీర్ ప్రొగ్రామ్ శిక్షణకు ఈ నెల 11న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పీబీ శ్రీనివాస్ తెలిపారు. ఎచ్చెర్ల స్కిల్ కాలేజీలో గురువారం వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 11వ తేదీ ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు హెచ్‌సీఎల్ ఎర్లీ ట్రెనింగ్ ప్రొగ్రామ్‌కు అర్హులనితెలిపారు. ఎంపిక కెరీర్ ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఉంటుందని అన్నారు. 25 నిమిషాలు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారు హెచ్‌సీఎల్ ఎంపిక చేసిన శిక్షణ సంస్థలకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు రూ. 10 వేలు శిక్షణ సమయంలో అందజేస్తామని పేర్కొన్నారు. ఏడాది శిక్షణకు అభ్యర్థులు రూ. 1.18 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని, మొత్తం చెల్లించలేని వారు ఎడ్యుకేషన్ లోన్ ద్వారా విడతల్లో ఉద్యోగం వచ్చిన తర్వాత చెల్లించవచ్చని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఏడాదికి రూ. 1.72 లక్షలు నుంచి రూ.2.2 లక్షలు వేతనం లభిస్తుందని అన్నారు. ఉన్నత విద్యకు సైతం హెచ్‌సీఎల్ సంస్థ సహకరిస్తుందని చెప్పారు. బిట్స్ పిలానీ, సస్త్రా, ఎమిటీ వంటి సంస్థల్లో ఉన్నత విద్యకు సహకరిస్తుందని తెలిపారు. ఉన్నత విద్యలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు బీఎస్సీ (డిజైనింగ్, కంప్యూటర్స్), బీఎస్సీ (ఇంజినీరింగ్, సైన్స్) ఉంటాయని అన్నారు. ఇంటర్మీడియట్‌లో మ్యాథ్స్, బిజినెస్ మ్యాథ్స్ సబ్జెక్టులు ఉన్న విద్యార్థులు మాత్రమే ఇంటర్వ్యూలకు అర్హులుగా తెలిపారు. 2023లో ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఉండాలని, కనీసం 60 శాతం మార్కులు ఇంటర్మీడియెట్‌లో ఉండాలని చెప్పారు. విద్యా ధ్రువీకరణ పత్రాలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని, పూర్తి వివరాలకు ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి వెంకటరమణ ఫోన్ నంబర్లు 6301045132, వేణుగోపాల్ ఫోన్ నంబర్ 8317652552లను సంప్రదించాలని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు వెబ్ సైట్ హెచ్‌టీటీపీఎస్://బీఐటీ.ఎల్‌వై/హెచ్‌సీఎల్‌టీబీ ఆంధ్రప్రదేశ్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు.

సెబ్ పనితీరు భేష్: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పనితీరు సంతృప్తికరంగా ఉందని ఎస్పీ జీఆర్ రాధిక పేర్కొన్నారు. ఎస్పీ అధ్యక్షతన గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో సెబ్ అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెబ్ విభాగం బాధ్యతతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న కేసులను ఛేదించాలని, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను త్వరితగతిన డిస్పోజల్ చేయాలన్నారు. అధికారులు కేసుల విచారణలో జాగ్రత్తలు పాటిస్తూ ముద్దాయిలకు శిక్ష పడే విధంగా దర్యాప్తు పూర్తిచేయాలని సూచించారు. జిల్లాలో ఎస్ఈబీ, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేసి సరిహద్దు ప్రాంతాల నుంచి నాటుసారా రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, జాతీయ రహదారులు, మారుమూల ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం రవాణాను అరికట్టేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ముందస్తు సమాచారం సేకరించి నాటుసారా తయారీ, మద్యం రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నాటుసారా వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించి వారిలో మార్పు తీసుకురావాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబర్చిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సమావేశంలో సెబ్ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.మణికంఠ, సెబ్ సూపరింటెండెంట్ కేపీ గోపాల్, సంబంధిత సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

8 నుంచి బీఆర్‌ఏయూకు వేసవి సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి ఈ నెల 8వ తేదీ నుంచి వేసవి సెలవులు ఇస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 31వరకు సెలవులు కొనసాగుతాయని, జూన్ ఒకటి నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యాలయం సెలవు దినాల్లో మినహా పనిచేస్తుందని చెప్పారు. అకడమిక్ ఏడాదిగాడిన పెట్టే ప్రక్రియలో భాగంగా ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్ క్లాస్‌వర్క్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పక్కాగా హాజరు కావాలని సూచించారు. బోధనేతర సిబ్బంది యధావిధిగా విధులకు హాజరు కావాలని అన్నారు.

కానిస్టేబుల్ ఇంటిలో చోరీ

- నాలుగు తులాల బంగారం, వెండి, రూ.30వేలు నగదు దొంగతనం



బీరువా లాకర్ ధ్వంసం చేసి ఉన్న దృశ్యం



చోరీ జరిగిన ఇల్లు

రణస్థలం: జేఆర్‌పురం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కె.హరీష్ ఇంటిలో చోరీ జరిగింది. ఆయన జేఆర్ పురం పంచాయతీలో గల ఫ్రెండ్స్ కాలనీలో నివాసముంటున్నారు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భోగాపురంలో బుధవారం జరిగిన సీఎం కార్యక్రమం విధుల కోసం హరీష్ తన అద్దె ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఒక రోజు ముందే తన భార్యను శ్రీకాకుళం పంపించేశా రు. సమావేశం ముగిశాక బుధవారం నేరుగా శ్రీకాకుళం వెళ్లిపోయారు. మళ్లీ గురువారం ఉదయం 11 గంటలకు భార్యతో కలసి ఇంటికి వచ్చి చూస్తే తలుపు గడియ పగులగొట్టి ఉంది. లోపలకు వెళ్లి చూసేసరికి బీరువా లాకర్ పగలుగొట్టి కనిపించింది. దీంతో జేఆర్‌పురం ఎస్‌ఐ రాజేష్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన చోరీ జరిగిన ఇంటిని క్లూస్ టీమ్ తో కలిసి పరిశీలించారు. నాలుగు తులాల బంగారం, నాలుగు తులాల వెండి, రూ.30వేలు నగదు దొంగలు పట్టుకెళ్లిపోయినట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

‘భరత్ మృతిపై విచారణ చేస్తున్నాం’

శ్రీకాకుళం క్రైమ్, లావేరు : లావేరు పోలీస్‌స్టేషన్ పరిధి బుడుమూరు జాతీయ రహదారిపై గేదెల భరత్‌కుమార్ అనుమానాస్పదంగా మృతి చెందడంపై విచారణ చేస్తున్నామని శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి పేర్కొన్నారు. విశాఖ జిల్లా మధురవాడ వాసి గేదెల భరత్‌కుమార్ బుధవారం వేకువజామున తీవ్రగాయాలతో బుడుమూరు జాతీయ రహదారిపై మృతి చెందడం తెలిసిందే. దీనిపై డీఎస్పీ మాట్లాడుతూ మృతుని మరణం ప్రస్తుతానికి అనుమానాస్పదంగానే ఉందని, పోస్టుమార్టం రిపోర్టు, సీసీ ఫుటేజీ తదితర సాంకేతిక అంశాలు, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాక అసలు విషయం తెలుస్తుందన్నారు. అయితే భరత్‌కుమార్ కుటుంబ సభ్యులు, బంధువులు మాత్రం ఇది ముమ్మాటికీ హత్యేనని చెబుతున్నారు.

ముమ్మరంగారబీ వరి కోతలు



యంత్రాల ద్వారా రబీ వరిచేను కోతలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని కోవిలారం, రావిచెంద్రి, ధనుకువాడ, స్కాట్‌పేట, జంబాడ, వలసపాడు, బొర్రంపేట తదితర గ్రామాల్లో రబీ వరి చేను కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. యంత్రాల ద్వారా కోతలు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది రబీ వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని, దళారులకు ధాన్యం విక్రయిస్తున్నామని రైతులు అన్నారు. తుఫాన్ వర్షాలు కారణంగా కోతలకు ఇబ్బందులు పడుతున్నప్పటికీ యంత్రాలతో కోతలు కోయిస్తున్నారు.

శ్రీకూర్మనాథాలయంలో పండిత గోష్టి



పండిత గోష్టి నిర్వహిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవంలో భాగంగా గురువారం పండిత గోష్టి నిర్వహించారు. ఆలయ అనివెట్టి మంటపంలోకి స్వామి ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వాములను వేంచింపజేసి ప్రత్యే క పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో పండితులు వేదాలను పఠించారు. పండితులను సన్మానించారు. కార్యక్రమంలో స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, శ్రీనివాసచార్యులు, కిషోర్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వ్యాప్తంగా రబీ 2022–23 సీజనులో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రబీ 2022–23 సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్నను రైతు భరోసా కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు.క్వింటా మొక్కజొన్నకు రూ.1962 మద్దతు ధర నిర్ణయించారని, మొక్కజొన్న సాగుచేసి ఈ – క్రాపు, ఈ–కేవైసీ చేయించుకున్న రైతులు తమ ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించేందుకు ఆర్‌బీకేలలో 12వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా పంటను శుభ్రపరచి, జల్లెడ పట్టి సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

గ్రామాల్లోని సమస్యలపై ఆరా



గేదెలపేట గ్రామంలో పర్యటిస్తున్న ఎండి సురేష్ కుమార్

జి.సిగడాం: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఎండీ గేదెల సురేష్‌కుమార్ గురువారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. నక్కపేట, సీతంపేట, గేదెలపేట గ్రామాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీతంపేట గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు రాకుండా పనులు చేస్తున్నామని తెలిపారు. అనంతరం పలు వీధుల్లో పర్యటించారు. కార్యక్రమంలో ట్రైనీ సబ్ కలెక్టర్ అమరేస్, స్థానిక సర్పంచ్ గేదెల మల్లిబాబు, వీఆర్‌ఓ ఎరకయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ బత్తిన స్వాతి కుమారి, ఏఎన్ఎం గుంటుకు కుమారి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వంపూరి గోపీనాథ్ మహిళా పోలీస్ పిన్నింటి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

అల్లెపల్లి గూడలో ఆర్డీఓ పరిశీలన



అల్లెపల్లి గూడను పరిశీలించిన శ్రీకాకుళం ఆర్డీఓ శాంతి

బూర్జ: మండలంలో గల వైకుంఠపురం గ్రామ పంచాయతీ అల్లెపల్లి గూడను శ్రీకాకుళం ఆర్డీఓ బి.శాంతి పరిశీలించారు. గ్రామానికి దగ్గరలో గల భకిరి కొండపై క్వారీ నిర్వహిస్తున్నారు. క్వారీ నుంచి రాళ్లు పేల్చినప్పుడు గ్రామంలోకి వచ్చి పడుతున్నాయని గ్రామస్తులతోపాటు గిరిజన సంఘాల నాయకులు క్వారీని నిలుపుదల చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమె గురువారం గ్రామాన్ని పరిశీలించారు. భకిరి కొండ సరుబుజ్జిలి, బూర్జ రెండు మండలాలకు మధ్యలో ఉండటంతో రెండు మండలాల రెవెన్యూ ఉప తహసీల్దార్లు డి.పద్మావతి, సంతోష్ కుమార్ సిబ్బంది, స్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం పాల్గొన్నారు.

రీ సర్వే పనుల పరిశీలన



కొత్తూరు మండలం వీఎన్‌పురంలో పొలాల్లో పాతాల్సిన కొలరాళ్ల వివరాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

కొత్తూరు : భూముల రీ సర్వే పనులు వేగవంతం చేయాలని స్థానిక తహసీల్దార్ పి.బాలకు టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. మండలంలోని వీఎన్‌పురం, వసప గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేలో భాగంగా పొలాల సరిహద్దులో పాతిన రాళ్లను పరిశీలించారు. రాళ్లు పాతడంలో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. మొదటి విడతలో రీ సర్వే చేసిన గ్రామాల్లో రాళ్లు పాతడం ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వానల కారణంగా రాళ్లు పొలాల్లోకి తీసుకెళ్లలేకపోతున్నామని తహసీల్దార్ చెప్పారు. వానలు తగ్గగానే పనులు చేస్తామన్నారు. మండలంలో 11,500 రాళ్లు పాతాల్సి ఉండగా 8700 వరకు పాతినట్లు తెలిపారు. మిగతావి రావాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



కామయ్య (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: గల నెల 29న రోడ్డు ప్రమాదంలో గాయపడిన వడ్డి కామయ్య (48) బుధవారం రాత్రి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. లావేరు మండలం మురపాకకు చెందిన ఈ వ్యక్తి జాతీయ రహదారి రోడ్డులో జరజాం సమీపంలో బైక్‌పై వెళుతూ ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను శ్రీకాకుళం రిమ్స్‌లోచేర్పించి అనంతరం ఓ ప్రైవేటు ఆస్పత్రికి మార్చారు. అక్కడే చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతను తాపీమేస్త్రీ.

సీఎం కప్ పోటీల్లో సిక్కోలు సత్తా



వెయిట్‌లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన సిక్కోలు క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: తిరుపతి వేదికగా జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉన్నతంగా రాణిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ తరఫున హాజరైన క్రీడాకారులు ఇప్పటి వరకు మొత్తం 16 పతకాలు సాధించి శభాష్ అనిపించారు. ఇందులో 7 బంగారు, 4 రజత, 5 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇంకా మరికొన్ని క్రీడాంశాల్లో ఫలితాలు రావాల్సి ఉండగా, ఇంకొన్ని ఈవెంట్స్ తుది దశలో ఉన్నాయి. సిక్కోలు క్రీడాకారులు దాదాపు అన్ని క్రీడాంశాల్లోనూ గట్టిపోటీ ఇస్తున్నారు. ముఖ్యంగా బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో అదరగొట్టే ఆటతీరుతో ఆకట్టుకుంటున్నారు. ఇందు లో బాక్సింగ్‌లో 4 బంగారు, ఒక ర జతం, 2 కాంస్య పతకాలు సాధించారు. వెయిట్‌లిఫ్టింగ్‌లో 3 బంగా రు, ఒక రజతం, 2 కాంస్య పత కాలు సాధించారు. అథ్లెటిక్స్‌లో 2 రజత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించారు.

సర్వత్రా హర్షం..

ఏపీ సీఎం కప్ రాష్ట్ర పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు విజయబావుటా ఎగుర వేస్తుండటంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ ఎం.నవీన్, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, డీఎస్‌ఏ సీఈఓ బీవీ ప్రసాదరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎస్.సూరిబాబు, వై.పోలినాయుడు, కోచ్‌లు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

37 రోజులు..రూ.41.96 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కింపును పరిశీలిస్తున్న ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి ఆదిత్యుని ఆదాయం ఏటికేటా పెరుగుతోంది. వేలాది మంది భక్తులు తమ మొక్కులను చెల్లించుకోవడంతో కేవలం 37 రోజు ల్లోనే ఆదిత్యుని హుండీల్లో కానుకల లెక్కింపు ద్వారా రూ.41,96,929 ఆదాయం లభించింది. గురువారం ఉదయం ఆలయ అనివెట్టి మండపంలో చేపట్టిన హుండీ కానుకల లెక్కింపులో నగదు రూపంలో రూ.40,20,780, చిల్లర రూపంలో రూ.1,76,149 లభించినట్లుగా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. రామతీర్థం ఆలయ ఈఓ కిశోర్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపు కార్యక్రమంలో 23 గ్రాముల 900 మిల్లీ గ్రాముల బంగారం, 2 కేజీల 200 మిల్లీ గ్రాముల వెండి వస్తువులు, విదేశీ మారకద్రవ్యంగా అమెరికన్ కరెన్సీ 11 డాలర్లు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కి చెందిన 20 బ్రిటన్ పౌండ్స్ కూడా లభించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ, పాలక మండలి సభ్యులు ద్వారపు అనూరాధ, లుకలాపు గోవిందరావు, దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్లు కె.వెంకటేశ్వరరావు, జీవీబీఎస్ రవికుమార్ తదితరులు ఉన్నారు. ఈ ఏడాది మార్చి 29 నుంచి ఈనెల 4 వరకు భక్తుల నుంచి మొక్కులుగా హుండీల్లో సమర్పించిన మొక్కులను లెక్కించినట్టుగా ఆలయ వర్గాలు ప్రకటించాయి.